# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

March / మార్చి-2025

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేధ్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.
- ఋగ్వేద సంహిత


# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : 101 March / మార్చి-2025 No./ సంచిక : 3



| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన- అనువక - కందాడై రామానుజాచార్య (శ్రీహరివంశము) | 2 |
| 2. | ధ్యానము - శ్రీ సదాశివ బ్రహ్మేంద్రస్వామి (ఆత్మవిద్యావిలాసము) | 3 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 4 |
| 4. | పూజ్యశ్రీ స్వామి ఓంకార్ వారి 131వ జన్మదిన సందేశము | 5 |
| | " పూజ్యశ్రీ స్వామి పద్మనాభానందమహరాజ్, ఋషికేష్, అఖిల దివ్య జీవన సంఘం ఉపాధ్యక్షులు | 5 |
| | " శ్రీస్వామి రామానంద - రాచపల్లి - రమణాశ్రమం | 7 |
| | " శ్రీస్వామి లక్ష్మణానంద - ఎరుకులపాలెం | 9 |
| | " స్వామిని సుమిత్రానంద సరస్వతి | 10 |
| 5. | ఆనంద రామాయణము - పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద | 13 |
| 6. | మానసోల్లాసము - శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 16 |
| 7. | ఏకాదశి | 19 |
| 8. | ఐదు క్షణములలో బ్రహ్మ సాక్షాత్కారము | 22 |
| 8. | కార్యక్రమములు - విరాళములు | 25 |


**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**


**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**




# ప్రార్థన

## శ్రీరామచరిత మానసము

**శ్లో॥ సంశయ సర్ప గ్రసన ఉరగాదః । శమన సుకర్కశ తర్క విషాదః॥**
**భవ భంజన రంజన సుర యూథః । త్రాతు సదా నో కృపా వరూథః ॥5॥**

**నిర్గుణ సగుణ విషమ సమ రూపం । జ్ఞాన గిరా గోతీతమనూపం॥**
**అమలమఖిలమనవద్యమపారం । నౌమి రామ భంజన మహి భారం ॥6॥**

**భక్త కల్పపాదప ఆరామః । తర్జన క్రోధ లోభ మద కామః॥**
**అతి నాగర భవ సాగర సేతుః । త్రాతు సదా దినకర కుల కేతుః॥7॥**

**అతులిత భుజ ప్రతాప బల ధామః । కలిమల విపుల విభంజన నామః॥**
**ధర్మ వర్మ నర్మద గుణ గ్రామః । సంతత శం తనోతు మమ రామః॥8॥**

**జదపి బిరజ బ్యాపక అబినాసీ । సబ కే హృదయఁ నిరంతర బాసీ॥**
**తదపి అనుజ శ్రీ సహిత ఖరారీ । బజతు మనసి మమ కాననచారీ॥9॥**

**తా॥** సందేహములనెడి సర్పములను తుదముట్టించు గరుడుడా! కఠోర తర్క జనిత! దుఃఖములను అంతరింపజేయువాడా! పునర్జన్మ రాహిత్యమును ప్రసాదించువాడా! దేవతలను ఆనందింపజేయువాడా! దయామయా! నన్ను కాపాడుము. నిర్గుణ సగుణ విషమ సమరూపములుగలవాడా! వాగింద్రియ జ్ఞానములకు గోచరింపనివాడా! నిరుపమా! నిర్మలా! సంపూర్ణా! దోషరహితా! అనంతా! భూభారమును తొలగించువాడా! శ్రీరామచంద్రా! నీకు ప్రణమిల్లెదను. భక్తులకు కల్పవృక్షవనమువలె సుఖములనిచ్చువాడా! కామక్రోధ లోభ మదములను పాఱద్రోలువాడా! సర్వసమర్థుడా! భవసాగరమును దాటించుటలో 'సేతువు' వంటి వాడా! సూర్యవంశ ధ్వజమా! శ్రీరామా! సర్వదా నన్నుబ్రోవుము. అపార భుజబల ప్రతాపములు గలవాడా! పరాక్రమధారా! కలి కల్మష భంజనా! ధర్మరక్షణ కవచమా! గుణములచే ఆనందమును గూర్చువాడా! శ్రీరామా! సర్వదా నాకుశుభములను అనుగ్రహింపుము. నీవు పవిత్ర స్వరూపుడవు. సర్వవ్యాపివి, శాశ్వతుడవు. సకల హృదయ నివాసివి, ఖరదూషణసంహారా! సీతాలక్ష్మణునితో గూడి వనములలో సంచరించుచున్నవాడా! స్వామీ! నీవు ఈ రూపముననే నా హృదయమున సర్వదా వసింపుము.

# ధ్యానము

శ్లో॥ నోదేతి నాస్త ముపయాతి న వృద్ధిమేతి
నైవోపయాతి పరిణామ మపక్షయం ।
స్వాధ్యస్త సర్వజననాది వికార సాక్షి
త్వేషా హి సంవిదితి చింతయ సతతం త్వమ్॥

**తా॥** ఏది ఉదయించదో, అస్తమించదో, పెరగదో, మారదో, క్షీణించదో, ఆత్మమీద ఆరోపితమైన పుట్టుక మొదలైన అన్ని వికారాలకి సాక్షిణి యేదో అదే ఈ సంవిత్తు అని నిరంతరం భావన చెయ్యి.

## గీతం

**వట్టిచేతులు గీతం:** రచన :కాటమరెడ్డి సత్యనారాయణ

**"బృందావనమది అందరిది" వరుస**

శాంతి ఆశ్రమం-తోటపల్లి
కాకినాడ జిల్లా,
సెల్ : 83095 98013

ఒట్టిచేతులతో వచ్చాము-వట్టి చేతులతో పోతాము
బ్రహ్మముహూర్తంలో సాధన ఎంతో-అనుకూలంరా మోక్షానికీ ॥ఒట్టి॥
సత్యవంతంగా జీవితము - కొనసాగించడమే సమాధిరా
సమాధి ద్వారా సంస్కారాలు - కరిగిపోవును గమనించూ ॥ఒట్టి॥
అహంకారము విడిచిపెడితే-మంచి వ్యక్తిత్వమే వస్తుంది
కాంతాకనకాలు రెండూ - మీ మనశ్శాంతిని హరించును ॥ఒట్టి॥
ధర్మపథంలో జీవిస్తూ-అర్థమాకాలు అనుభవించు
అదియే నీకు ఆఖరి మజిలీ - మోక్షప్రాప్తి సిద్ధించునులే ॥ఒట్టి॥
ఏది నువు మరి కోరకపోతే - అన్నీ నీదరి చేరునులే
తపస్సు ద్వారా మానవుడు-సాధించలేనిది ఉండదుగా ॥ఒట్టి॥
భగవంతుడు ఒక వ్యక్తి కాదు-శక్తని నీకు తెలియాలి
ఆ శక్తే మరి నీలోనేఉంది - నీలోపలకి నీవు వెళ్ళాలి ॥ఒట్టి॥
జీవితంలో సంఘటనలు అన్నీ - ముందే నిర్ణయమౌతాయి
జరిగేవన్నీ ఆకస్మికము - కానేకాదు తెలుసుకో నీవు ॥ఒట్టి॥



# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

(గత సంచిక తరువాయి) **అధ్యాయం - 58**

## శాంతి ఆశ్రమములో సేవా కార్యక్రమాలు

**వృద్ధాశ్రమము**

జీవించి ఉన్న ప్రతి ఒక్కరూదేవుని ప్రతిరూపాలే కనుక శాంతి ఆశ్రమము అనాథలు, నిరుపేదలు అయిన చిన్నారులను గురుకులము నిర్వహించి సేవ లందించటంతో తృప్తి పడలేదు. నేను ఎప్పుడూ వృద్ధులు, రోగులు, క్రుంగిపోయిన వాళ్ళు, బిడ్డలు చూసుకోకుండా వదలివేసిన వాళ్ళకు కూడా సేవలందించాలని కలలు కన్నాను. మన పురాణాల్లో చెబుతారు వయస్సు మళ్ళిన మగవారందరూ భగవాన్ శివుని ప్రతిరూపాలు, అలాగే పాతకాలపు స్త్రీలు అందరూ కూడా పార్వతీదేవికి ప్రత్యక్ష రూపమేనని, అందువలన మేము ఒక ఆదర్శవంతమయిన వృద్ధాశ్రమాన్ని నిర్మించి శాంతి ఆశ్రమంలో ఆ భక్తులయిన తాతయ్యలకు, నానమ్మలకు, అమ్మమ్మలకు సేవలందించాలనుకున్నాము. ఇప్పుడు ఇరవై ఐదు మంది స్త్రీ పురుషులున్నారు. వృద్ధాశ్రమంలో, ఆశ్రమము వారందరినీ ఎంతో ప్రేమానురాగాలతో చూసుకుంటోంది. వారిలో కొందరు స్త్రీలు ఆశ్రమంలోని వంటశాలలో కొన్ని గంటలు సహాయం చేస్తుంటారు. కూరగాయలు కోస్తుంటారు. అలాగే గురుకులములోని విద్యార్థులకు నిజమయిన అమ్మమ్మల్లాగా ఉండేవారు. వారందరూ శాంతి ఆశ్రమానికి వరంలాగా ఆశీస్సులందించేవారు. ప్రపంచంలోని వృద్ధులయిన స్త్రీ, పురుషులందరిని భగవంతుడు ఆశీర్వదించుగాక! శాంతిని ప్రసాదించుగాక! కొందరు పెద్దవారు ఆశ్రమంలో కొంతకాలము శాంతిలో గడిపి తర్వాత ఇళ్ళకు తిరిగివెళ్ళి వాళ్ళ పిల్లలకి, మనుమలు, మనుమరాళ్ళకి శాంతిని ప్రచారం చేసేవారు. ఆ విధంగా మౌనంగా నిశ్శబ్దంగా శాంతి ఆశ్రమము ఎందరో అంకితభావం గల భక్తుల హృదయానికి చేరువయింది.

వృద్ధులకు ఆశ్రమాలుండటం చాలా బాగుంటుంది. వారు నిస్సహాయ స్థితిలో ఉంటారు. కొందరు నిరుపేదలుంటారు. వారు యవ్వనంలో ఉన్నప్పుడు చక్కని జీవితాన్ని గడిపి ఉంటారు. ఈ భౌతిక ప్రపంచంలో మనము తరుచుగా చూస్తూనే ఉంటాము. వారు ఆరోగ్యంగా ఉండి అందరికి సేవలు చేస్తున్నంత కాలము ఎంతో ప్రేమగా, ఆరాధించబడతారు. ఒక్కసారి ఆరోగ్యం దెబ్బతిని, వృద్ధులయిపోయి, సంపాదన లేక ఇతరులపై ఆధారపడే పరిస్థితి రాగానే అంతవరకు ఎంతో ప్రేమించిన సొంతవారు, దగ్గరివారు కూడా వారిని నిర్లక్ష్యం చేయటము, మర్చిపోవటము, వదలివేయటము చేస్తుంటారు. కొన్నిసార్లు వాళ్ళని చాలా భారంగా కూడా భావిస్తుంటారు.

# పూజ్యశ్రీ స్వామి ఓంకార్ వారి 131వ జన్మదిన సందేశం

**-పూజ్యశ్రీ స్వామి పద్మనాభానందమహరాజ్**

ఈరోజు శ్రీఓంకార్ స్వామి 131వ పుట్టినరోజు. పుట్టినరోజు విశిష్టతను గూర్చి తెలుసుకుందాం. భగవంతుడు అజుడు, అనగా పుట్టక లేనివాడు. పుట్టుక లేనివానికి పుట్టినరోజు ఎలా ఉంటుంది? జీవులకు అయితే పుట్టినరోజు ఉంటుంది. సాధువులకి మహాత్ములకు ఎందుకు? వారు జనన మరణములకు అతీతులు. షడూర్ములు లేనివారు. కృష్ణుడు భగవంతుడు. ధర్మాన్ని సంస్థాపించడానికి వచ్చాడు. కాలంలో ధర్మం మలినమయిపోతుంది. చెడు అలవాట్లు పుడతాయి. మళ్ళీ వీటిని పునరుద్ధరించడానికి భగవంతుడు వస్తాడు. ఆయనకి 30 అవతారాలు. వ్యాసుడు, దత్తాత్రేయుడు మొదలుగువని. దశావతారాలు. ఇవి అంశావతారాలు. ఒకపని గురించి వచ్చి అది నెరవేర్చి, వెళ్ళిపోతారు. రామావతారము, కృష్ణావతారములు పూర్ణావతారములు. మనం కూడ భగవంతుని అవతారములే. కాని మనం గ్రహించ లేకపోతున్నాము.

వేదములలో చెప్పబడునదే వ్యాసుడు చెప్పాడు. వేదాలని అర్థం చేసుకోలేనివారికి భారతము, భాగవతములు ఇది అన్న శంకరాచార్యస్వామి కాలానికి ముందే ఉన్నాయి. అధర్మం పెరిగిపోయింది. ధర్మము మళ్ళీ ఉద్ధరింపబడాలి. ఆ పనికి వచ్చిన వారే రామకృష్ణ పరమహంస, శివానందస్వామి, ఓంకారస్వామి, జనులు మరచిపోయిన దానిని జ్ఞాపకం చేస్తున్నారు. ధర్మము పూర్వకాలం నుంచి ఉంది. క్రొత్తది కాదు. వేదములలో చెప్పబడినదే చిన్న తేలిక మాటలలో చెప్పారు.

బ్రహ్మసూత్రాలలో అధ్యాస అనేమాట ఉంది. ఒకేదానిని చూసి ఇంకొకటి అనుకొనుట. తాడుని చూసి తాడని తెలియక పామనుకొనుట. మహాత్ములు అధ్యాసని తొలగించి సత్యాన్ని చూపిస్తారు. రాయి మీద కుక్క బొమ్మవేస్తే రాయి కనిపించదు. నగలు చూస్తే బంగారం కనిపించదు. అధ్యాస పోవాలి.

ఋషులు చిన్న చిన్న వాక్యాలలో చెప్తారు సామాన్య జనాలకి. శివానందస్వామి జానపద పాటలు పాడేవారు. అందరూ పాడేలా పాడేవారు. వేదాలలోని సత్యాన్ని తేలికమాటలలో చెప్పారు. భగవంతుడు మనలోపలే ఉంటే బయట ఉన్నాడని



ఎందుకు అంటున్నారు? విశ్వశాంతి ప్రార్థనలో మొదటి వాక్యము **అహంఅస్మి.** నేను ఉన్నాను ఇది అనుభవము. **సత్** అనగా ఉనికి. **అసత్** నుంచి సత్యము వైపుకు నన్ను నడిపించు. సత్తేచిత్తు. ఇది అంతటా పైన క్రింద, లోపల, బయట, ముందు వెనుక అంతటా వ్యాపించి ఉన్నది. కేనోపనిషత్‌లో భావమే ఈ ప్రార్థనలో ఉంది. నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, ప్రాణములకు ప్రాణము, ఈ అనుభవము మాకు ఇప్పుడే ఇక్కడే కలుగుగాక. ప్రహ్లాదుడు అంటాడు. దేవుడని తెలుసుకోవడానికి పెద్ద ప్రయత్నము ఏమీ అవసరములేదు. ఎందుకంటే సిద్ధవస్తువు కాబట్టి. సిద్ధించియే ఉన్నది. ఇదే మా ప్రార్థన. మనం అనేక కోరికలతో ప్రార్థన చేస్తుంటాము. భగవంతుడే మనలని వెదుక్కుంటూ వస్తాడు. నిరాపేక్షం ఏ కోరిక లేనప్పుడు, నీ దర్శనమే కావాలి అన్నప్పుడు, నిర్వైర్యం విరోధ భావము లేనప్పుడు అన్నిటయందు సమ దర్శనము ఉన్నప్పుడు. భగవద్గీతలో చెప్పిన భక్తుని లక్షణాలు మనం కలిగి ఉంటే మనవెనకే భగవంతుడు వస్తాడు. **అనువ్రజామి.** భక్తుని పాదధూళి ఆయన మీద పడుతుందని భక్తుని వెనకాల నడుస్తాడు. భక్తి ఒక కోరిక కాదు. విరక్తియే భక్తి. ఆయన ఏది అయినా ఈయగలడు. అవి కావాలా? లేక భగవంతుడే కావాలా?

ఆనందానికి మరోపేరు పరమశాంతి. ఇది పదవీ విరమణ తరువాత కావాలి అని కోరుకుంటామా? లేక ఇప్పుడే ఇక్కడే కావాలి అని కోరుతామా? ఇతరములైన కోరికలు వదలి భగవంతుడే కావాలి అనే కోరిక ఉండాలి. ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన. శ్రీరమణమహర్షి ఆత్మసాక్షాత్కారము అన్నిటికన్నా సులభమైనది అన్నారు. నేను భగవంతుని చేతిలో ఒకసాధనము. పైన చెప్పిన విషయాలు అందరికీ ప్రచారం చెయ్యాలి. మహాత్ములు నేను వస్తాను అనరు మేము వస్తాము అంటారు, అందరితో తాదాత్మ్యభావము ఉన్నందువలన. వారు ఒక వ్యక్తి కాదు. నాకు ఏ అనుభవం ఉందో అది అందరికి ఉండాలి. శంనోద్విపదే... అన్ని ప్రాణులూ సుఖంగా ఉండాలి. మహాత్ములు ఇలాగ ఆలోచిస్తారు. బ్రహ్మ, నారదుడు మనకి గురువుగా ఉండి అదే చెప్పారు. ఉపదేశముగా భగవంతుడే ఓంకారస్వామిగా వచ్చి ఈ ప్రార్థన చెప్పారు.

## పూజ్యశ్రీ స్వామి ఓంకార్ వారి 131వ జన్మదిన సందేశం

**- శ్రీస్వామి రామానంద**

పరమ పావనమైనటువంటి పవిత్రశాంతి ఆశ్రమములో శ్రీఓంకారస్వాముల వారి 131వ జన్మదిన వేడుక సందర్భంగా పరమపూజ్య మాతాజీ వారు ఉదయము జన్మదిన సందేశం నాకు మహామంత్రంలాగా అనిపించింది. ఎందుకంటే స్వామివారి యొక్క అడుగుజాడలలో నియమము తప్పకుండా అనుసరించినటువంటి ఆ అమ్మ ఏది మాట్లాడినా మంత్రమే అని నేను హృదయపూర్వకంగా విశ్వసిస్తున్నా. నియమం అనేది జీవితంలో చాలా ముఖ్యమైన అంశం, సాధువులందరికి కూడా నియమం అనేది లేకపోతే నశించిపోతారు. నియమం వినానశ్యతి. సాధకులు ఏదైనా ఒక నియమాన్ని ఏర్పరచుకున్నట్లయితే ఏ అనివార్యకారణాలచేతనైనా నియమాన్ని విడనాడనట్లయితే ఇది ఆశయంగా తీసుకొని జీవితంలో అన్నింటినీ సడలించి వెళ్ళిపోయే స్థాయికి వెళ్ళడం జరుగుతుంది.

**నిర్మలాకాశ సదృశం, నిరాపేక్ష ప్రబోధకం,**
**ఓంకారానందదాయకం, ఓంకారాయ నమో నమః**

పరమపూజ్య ఓంకార స్వామీజీ స్వరూపం నిర్మాలకాశం వంటిది. ఎంత అలజడిగా ఉన్నటువంటి మనస్సు అయినా సరే స్వామివారి సన్నిధికి రాగానే ప్రశాంతంగా, ఏకాగ్రంగా, నిర్మలంగా మారుతుంది. ఎందుకు ఏకాగ్రంగా ఉంటుంది అంటే ఆ నిర్మలమైన స్థితి వారి యందు ఉంది కాబట్టి చపలచిత్తులను కానివ్వకుండా అక్కడ మన మనస్సు నిర్మలమైపోతుంది. అగ్ని సమీపములోకి వెళ్ళినప్పుడు వేడి ఎలా అయితే మనవైపు ప్రసరిస్తుందో, పిల్లగాలులు వచ్చినప్పుడు చల్లగాలి ఎలాగైతే వస్తుందో అలాగే మహాత్ముల దివ్యసన్నిధానమునకు వెళ్ళినపుడు ఆ నిర్మలత్వం అనేది లభిస్తుంది. అకాశం ఎండా, వాన, చలి దేనికీ ప్రభావితం చెందకుండా ఒకే విధంగా ఉంటుంది. స్వామివారు ఆకాశం వలె నిర్మలమైనటువంటివారు. తమ సన్నిధికి వచ్చినటువంటి వారికి ఎటువంటి ఆపేక్ష లేకుండా ఆత్మజ్ఞానాన్ని బోధించి నటువంటి మహాత్ములు. పుత్రులను పోషించడంలో కూడా ఎక్కడో ఒకచోట ఆపేక్ష అనేది లేకుండా పోషించరు. కేవలం ఆత్మజ్ఞానసంపన్నులు మాత్రమే ఎటువంటి ఆపేక్ష లేకుండా ఏదైనా కార్యాన్ని చేపట్టగలరు. సముద్రం వద్ద అలలో నుండి వచ్చే నాదం ఏదైతే ఉందో అది ఓంకారమే. పక్షుల కిలాకిలారావాలి ఏవైతే



ఉన్నాయో అవి ఓంకారమే. చెట్ల ఆకుల కదలికలలో నుండి వచ్చే నాదంకూడా ఓంకారమే, అన్ని శబ్దాలు ఓంకారమే. ఓంకారమే ఆనందము. ఆనందమే ఓంకారము. ఓంకారముకన్న వేరైనది మరొకటి లేదు. భూత భవిష్యద్ వర్తమాన కాలాలలో జ్ఞానాన్ని మించినది మరొకటి లేదు. **నహి జ్ఞానేన సదృశం**. ఎవరైనా వ్యాపారంలో ఉత్తేజితులయ్యారు అంటే ఎలా అయ్యారు అని మనం అన్వేషించి మనం కూడా అలాగే అవ్వాలి అని ప్రయత్నిస్తాము. లౌకిక విద్యలో ఎవరైనా ఉన్నత విద్యను పొందారు అంటే ఎలా పొందరు మనం కూడా వారిని అనుసరించాలి అని అనుకుంటాము. కానీ జ్ఞానమును మించినది మరొకటి లేదు అని భగవంతుడే చెప్పినా, ఎందరో మహాత్ములు అనేక విధాలుగా చెప్పినా కూడా దానిని పొందాలి అని మనం ఎందుకు అనుకోవడం లేదు. ఒక సన్యాసి ఆశ్రమానికి వచ్చారు, ఆ సందర్భంలో స్వామీజీ మరియు సన్యాసి మధ్య సంభాషణ.

**సన్యాసి :** ఆశ్రమం చాలా సువిశాలంగా ఉంది ఇక్కడ నేను కొంతకాలం ఉండాలనుకుంటున్నాను.

**ఓంకార స్వామీజీ :** మీ వృత్తి ఏమిటి?

**సన్యాసి :**నేను యాత్రలవీ చేసుకుంటూ తిరుగుతుంటాను, నాకు ఏ వృత్తీ లేదు.

**ఓంకార స్వామీజీ :** ఏ వృత్తీ లేకుండా ఎలాగ ఏదో ఒక వృత్తి ఉండాలి కదా. సాధనలేదు, ధ్యానము లేదు, జపము లేదు, అధ్యయనము లేదు, ఏం వస్తుంది నీకు?

**సన్యాసి :** నాకు ఏమీ రాదు. నా దగ్గర అక్షయపాత్ర (భిక్షపాత్ర) ఉంది.

**ఓంకార స్వామీజీ :** ఓ! ఇది కూడా ఒక వృత్తా, చాలా మంచిది, ఉదయాన్నే నీ కాలకృత్యాలను ముగించుకొని నీ వృత్తిని కొనసాగించు, చుట్టుప్రక్కల గ్రామాలలో ఆహారం లేక చాలామంది ప్రజలు దుఃఖిస్తున్నారు. వారందరి ఆకలి తీర్చాలి. అటువంటి వారికి జ్ఞానం ఎలా బోధపడుతుంది. శాంతి ఆశ్రమానికి వెళితే వేడి నీళ్ళు ఉంటాయా అని అడిగారు కొందరు. ఓంకార స్వామీజీ ఇక్కడకు వచ్చినపుడు జలం లేవు. స్వామీజీ తపస్సుచేసి నీళ్ళు తెప్పించారు. దోమలున్నాయా, నీళ్ళున్నాయా అని అడిగితే ఏమి సాధన అది. ఓంకార స్వామీజీ ఎలాగైతే ఇక్కడ తపస్సు చేసి దేహరహిత స్థితిని పొందారో వారి అనుగ్రహం ద్వారా మనమందరము కూడా ఆ స్థితిని పొందడానికి ప్రయత్నించాలి.

## పూజ్యశ్రీ స్వామి ఓంకార్ వారి 131వ జన్మదిన సందేశం

**- శ్రీస్వామి లక్ష్మణానంద**

మా గురువుగారు నిర్విష్యానంద స్వామివారు ఓంకార స్వామీజీ యొక్క జీవితము, జీవిత ఆశయాలు, వారు ఈలోకానికి అందించినటువంటి సేవలను పద్యరూపములో (108 పద్యాలు) ఓంకార యతీంద్ర శతకంను రచించారు. దీనిని పఠించినప్పుడు తెలియనటువంటి స్థితికి వెళ్ళిపోతాము. ఓంకారస్వామీజీ వారు 20సం. వయస్సు కన్నా తక్కువగా ఉన్నప్పుడే పులులు సంచరించేటువంటి ఈ అడవిలో తపస్సు చేసి సువిశాలమైన ఆశ్రమాన్ని మనందరికోసం ఏర్పాటు చేసి సుఖంగా శాంతిగా ఉండండి అని ఆశీర్వదించారు. ఒంటినిండా గుడ్డ లేకుండా కేవలం కౌపీన ధారియై అరుణాచలం కొండమీద ఉన్న రమణమహర్షులను చూసి వారి తల్లి దుఃఖిస్తూ ఉండడం అందరూ చూసి మహర్షి దగ్గరకు వెళ్ళి ఆ తల్లిని ఓదార్చుమని ప్రాధేయపడ్డారు. మహర్షులవారి సమాధానం ప్రతి జీవుడు వారి వారి ప్రారబ్ధ కర్మానుసారం సుఖము లేదా దుఃఖమును పొందుతాడు. జరగరానిది ఎవరు ఎంత ప్రయత్నించినను జరిపించలేరు, జరగవలసినది ఎవరు ఎంత అడ్డుకున్నను ఆపలేరు. కావున మౌనముగా ఉండటం ఉత్తమం అని అన్నారు, చెప్పడమే కాదు వారు వారి జీవితాన్ని ఆమాటకు అంకితం చేసారు. శాంతి ఆశ్రమం స్థాపించి 108 సం॥లు అవుతుంది. ఈ ఆశ్రమానికి ఒక అష్టోత్తరం జరిగింది. చిన్న చిన్న కార్యాలు చేపట్టడానికే మనం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటాము. స్వామీజీ వారు ఇంత పెద్ద ఆశ్రమాన్ని అనాయాసంగా స్థాపించారు, ఇక్కడ మనము సాధన చేసుకోవడానికి అవకాశాన్ని కల్పించారు. దేహములోని ఒక భాగాన్ని త్యాగం చేయగలిగిన మహాను భావులు స్వామీజీ. మహాత్ముల యొక్క ఉపదేశాలను మనము పాటించినట్లయితే మనం కూడా జీవితంలో సుఖశాంతులను పొందుతాము.



## పూజ్యశ్రీ స్వామి ఓంకార్ వారి 131వ జన్మదిన సందేశం

**- స్వామిని సుమిత్రానంద సరస్వతి**

ఓంకారస్వామి వారి జీవితం మనకు ఆదర్శం. ప్రతి అడుగులోను వారి యొక్క శక్తి తెలుస్తుంది. ఈ ఆశ్రమము పెట్టి వందసంవత్సరాలు అయినా ఇంకా సజీవంగా స్వామి యొక్క శక్తి నడయాడుతుంది. నేను 2004 లో ఈ ఆశ్రమము వచ్చాను. చిన్న వయసులో నేను ఇక్కడకి వచ్చాను. వచ్చిన రోజే ఇది నా సొంతం అనేంత భావన వచ్చింది. అలాగే మాతాజీ ఇచ్చిన ప్రార్థనతో నాజీవితం స్పిరిట్యుయల్ జర్నీ ఒక మలుపు తిరిగింది. ఆ ప్రార్థన ఈ రోజుకి నేను వదలలేదు. ఏమీ తెలియని నన్ను ఈ ప్రార్థనే నడిపిందని నా జీవితమే తెలియజేస్తుంది. అయితే శాంతి ఆశ్రమము అన్నప్పుడు ఇక్కడికి వచ్చిన వాళ్ళు వారితో పాటుగా ఈ శాంతిని తీసుకువెళ్ళాలి అనేది నా సొంత అభిప్రాయం. ఎందుకంటే అశాంతిగా ఉన్న ఎంతో మందికి “ఇక్కడ అడుగు పెట్టడమే ఆ శాంతి మనకు తెలుస్తుంది. ఎంతో మందికి శాంతిని ఇచ్చిన శాంతి ఆశ్రమం.

మా తాతగారు కలిదిండి నారాయణరాజు గారు ఓంకార స్వామి సమకాలికులు అని నాకు ఇక్కడికి వచ్చిన తరువాత తెలిసింది. వారు వ్రాసిన లెటర్స్ మాతాజీ నాకు ఇచ్చినప్పుడు చాలా ఆశ్చర్యం అనిపించింది. ఎందుకంటే ఎవరీ జర్నీ ఎటు వెళ్తుందో తెలియదు. నా జర్నీ చూసినప్పుడు మాతాజీ ఓంకారస్వామి పుట్టినరోజుకి వచ్చినప్పుడల్లా సాధు సంతులకి ఎంతో సేవ చేసుకునే అవకాశం నాకు కల్పించారు. వారందరి ఆశీర్వాదం వల్లనే నేను ఈ రోజు ఇలా ఉన్నాను అనిపిస్తుంది. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడకు రావడం వలన ఈ ఆశ్రమంలో ఉన్న విశిష్టత అందరూ అర్థం చేసుకున్నా, లేకున్నా ఎంతో మంది మహాత్ములు ఇక్కడ సాధన చేసుకున్నవారే. ఎందరో పీఠాధిపతులు, మఠాధిపతులు, సాధువులు వీరిలో ఎవరిని అడిగినా అందరూ శాంతి ఆశ్రమంలో సాధన చేసుకుని వెళ్ళిన వాళ్ళమనే చెబుతారు. నేను గమనించినంతవరకు వారందరూ ఇక్కడికి వచ్చి ఎంతటి సూక్ష్మత అనగా స్వామి యొక్క తపఃశక్తిని గ్రహించగలిగారు. స్వామి గురించి ఏమీ తెలియనక్కరలేదు. ఎందుకంటే ఆయన ఆపరదధీచి లాగా ఆ ఎముక తీసి ఇవ్వగలిగారంటే అదొక్కటి చాలు. ఇప్పటివరకు చరిత్రలో ఎవ్వరినీ చూడలేము. అలాంటి గొప్ప మహాత్ముడు నడియాడిన ప్రదేశములోనే మనం ఉన్నామంటే అంతకంటే గొప్ప అదృష్టం మనకి ఇంకొకటి లేదు. అయితే మనిషి అన్ని అనుభవిస్తాడు కాని తనను తప్పించి, తన స్వరూపాన్ని తప్పించి మిగతావన్ని అన్వేషిస్తాడు. అన్నిటికి ప్రాముఖ్యత ఇస్తాడు. రూపం నుంచి స్వరూపానికి మారాలంటే మానవజన్మ ఒక్కటే అని తెలిసినా సరే, బాహ్య విషయాల పట్ల వ్యామోహం అంత తొందరగా వదలదు. దానికి సాధన అవసరం అనితెలిసినా ఏ సాధన చెయ్యాలి, ఎలా చెయ్యాలి అనే మీమాంసలో సగం జీవితం వెళ్ళిపోతుంది.

ఏ సాధన చెయ్యాలనుకున్నా అసలు మొదటి సాధన ఎందుకు చెయ్యాలి అనే విషయం తెలిస్తే, నా స్వరూపాన్ని నేను చేరడం కోసం సాధన చేస్తున్నాను అనేది

తెలుస్తుంది. మన జీవితంలో ప్రతిదానికి ఉదాహరణకు, ప్రతీ వస్తువుకి కూడ మనం ప్రాధాన్యత ఇస్తాము. ఒక కాఫీ ఉందనుకోండి. దానికి మనమే కదా ప్రాధాన్యత ఇచ్చాము. కాఫీ చాలా రుచిగా ఉంది. ఆ రుచిని ఆస్వాదించేటప్పుడు మన చైతన్యశక్తి నుండే దానిని గ్రహిస్తుంది. అలాగే మన జీవితంలో ప్రతి విషయానికి ప్రాధాన్యత ఇచ్చినంత సేపు మనం బాహ్యంగానే ఉన్నట్టు లెక్క. స్పిరిట్యుయల్ జర్నీ పేరు చెప్పి మనం ఎక్కడికి తిరిగినా, ఏం తిరిగినా మళ్ళీ ఈ స్వరూపం, ఈశక్తి తోటే మీరు ప్రతీదానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

భగవాన్ రమణమహర్షి ఈ విధంగా చెబుతారు.

**హృత్థలే మనః స్వస్థతా క్రియా । భక్తియోగబోధాశ్చ నిశ్చితమ్ ॥10॥**

మన హృదయ స్థానంలో మనమనస్సు స్థిరం చేసినప్పుడు అదే భక్తి, అదే బోధ, కానీ హృదయస్థానంలో మనస్సు నిలపడానికి మనకు సాధన పేరు చెప్పి ఎంతసేపు నిలబడగలుగుతాము. అదే బయట బాహ్య విషయాలకి ఎంత సేపు ప్రాధాన్యత ఇస్తాము అనే విషయం చూస్తే మనకే అర్థం అయిపోతుంది. కాబట్టి జీవితం వేరు, ఆధ్యాత్మికత వేరు అని అనుకుని దానికి కొంతటైమ్ అని ఇవ్వడం కాదు. జీవితమే ఆధ్యాత్మికత అనే విషయం తెలిస్తే తప్పనిసరిగా **(ఉద్ధరేదాత్మ నాత్మానం)** నిన్ను నువ్వు ఉద్ధరించుకోవడానికి వచ్చాం అనే విషయం తెలుస్తుంది.

ఎంతో మంది మహాత్ములు వారి జీవితాలు త్యాగం చేసి ఎన్న బోధలు మనకిచ్చినా, ఏం చేసినా ఎవరైతే రూపం నుంచి స్వరూపానికి వెళ్ళకుండా ఉంటారో వారందరు అనేకజన్మలు పుడుతూనే వస్తాము. ఒక్క మానవజన్మలోనే అవకాశం ఉందని అందరికి తెలిసినా దేనికి ప్రయారిటీ ఇవ్వాలి. ఎంతవరకూ ఇవ్వాలి. ఎంతవరకూ ఇవ్వకూడదు అనే జ్ఞానం ఉంటే మన ప్రయారిటీ మారిపోతుంది. యాత్రలకి వెళతాము, మహాత్ములను దర్శించుకుంటాము. ఎంతో ఇష్టం ఉంటే తప్పించి ఈ జర్నీ జరగదు. ఎన్ని జరిగినా, ఎన్నిచేసినా రూపం నుండి స్వరూపానికి రావాలి అనే విషయం పక్కన పెట్టేస్తాము. అన్నింటికి ఇచ్చిన ఇంపార్టెన్స్ మనకి మనం ఇచ్చుకోలేకపోవడం వలన అన్నిటికంటే విలువైన కాలాన్ని మనం వదిలేస్తాము. ఈ కాలము మన పుణ్యం. ఆ పుణ్యాన్ని ఖర్చుపెట్టి ఈ జీవితాన్ని నడుపుతున్నాము. కాబట్టి ఆకాలాన్ని మనం సద్వినియోగం చేసు కోవా లంటే మనం ఏం చెయ్యాలి అనేది తెలుసుకుంటే మనం దైవసన్నిధిలో ఉన్నట్టే.

ఓంకార స్వామి చెప్పినట్టుగా సర్వశక్తి పనిచేస్తున్నప్పుడు జీవుడు నిష్క్రమిస్తాడు. ఆ వాక్యం చూస్తే మనస్సు పైకి లేవకుండా ఉండేంత బలమైన సందేశం. ఓంకార స్వామి యొక్క శక్తి ఇలాంటి వాక్యాలలో తెలుస్తుంది. ఎందుకంటే మహాత్ములు వారు వేసిన బాట మనం నడవడానికి మార్గము. మనం కూడా మన బిడ్డలకి బాట వేస్తాము. మనం కష్టపడ్డాం కాబట్టి మన పిల్లలు కష్టపడకూడదు అని మనం బాట వేస్తాము.



కానీ మహాత్ములు ఎంతో కష్టపడి మనల్ని జన్మరాహిత్యంవైపు తీసుకువెళ్ళడానికి వాళ్ళు ఒక బాట వేస్తారు. మనం మన పిల్లల కోసం ఎంత తాపత్రయపడతామో మహాత్ములు మనందరి కోసం అంతకన్నా ఎక్కువ తాపత్రయ పడతారు. ఈ విషయం ఓంకార స్వామిని చూస్తూ బాగా అర్థం అవుతుంది. ఇప్పుడు ఈ ఆశ్రమానికి రావడానికి చాలా సౌకర్యాలు ఉన్నాయి. అప్పుడు ఆయన ఉన్నప్పుడు ఎలాంటి సౌకర్యాలు లేని రోజుల్లో ఆయన ఇక్కడికి వచ్చి మనందరి కోసం ఎంతో కృషి చేసారు. వారు ఎక్కడకూర్చుని కళ్ళు మూసుకున్న అయిపోతుంది. కానీయెంత కృషి చేశారంటే ప్రతీ అడుగు, ప్రతీచెట్టులోను ఆ వికాసము, తేజస్సు రెండింటిని నింపి బాటవేసి వెళ్ళిన మహాత్ములు. అందుకే మహాత్ముల జన్మదినం, వాళ్ళ జన్మని అర్థం చేసుకోవడానికి జరుపుతారు. అంటే మనం పుట్టినరోజు జరుపు కోకూడదు మన పుట్టినరోజు ఎవరైనా జరుపుకోవాలి.

మహాత్ముల బాటలో మనం నడవాలి అంటే మన జీవితం రూపం నుండి స్వరూపానికి వెళ్ళాలి అనే ప్రయత్నం చెయ్యాలి. ఎన్ని గ్రంథాలు చదివినా, ఏం చేసినా అందరికీ తెలుసు ఆచరణ ఒక్కడే మనల్ని ముందుకు నడుపుతుందని. అయితే ఆచరించడానికి ఎన్నో ఆటంకాలు వస్తున్నాయి అని మనము అనుకుంటాము. కానీ ఆటంకము అనేది మనలోపల ఉన్న స్వభావము, గుణాలు, ఊహలు అని మాత్రం పట్టించుకోము. మరి జన్మ జన్మలనుండి పుట్టుకొచ్చిన మనం ఈ జన్మలో ఇన్ని అవకాశాలు ఉంటే ఆ అవకాశాలని సద్వినియోగం చేసుకుంటూ మన జీవితాన్ని ముందుకు నడపాలని అనుకోము. కనీసం మహాత్ములు ఎంతో కృషి చేశారు. వాళ్ళకిలా మనం అవ్వకపోయినా వారి బాటలో మనం నడిస్తే చాలు అన్న విషయం మనకు అర్థం కావాలి. వాళ్ళు మనకి అందించిన సంపదని మనం తీసుకుని మన తర్వాత జనరేషన్ అందించడమే గృహస్థు యొక్క ధర్మం. అటు గృహస్థు ధర్మం ఆచరించక ఇటు జన్మ రాహిత్యానికి వెళ్ళక ఆ మధ్యలో ఉండిపోతే మన జీవితం వ్యర్థం అయిపోతుంది. కనీసం గృహస్థు ధర్మంగా వెనక తరానికి మనం ఆదర్శంగా నిలబడినా ఫర్వాలేదు లేదా మహాత్ముల బాటలో నడిచినా ఫరవాలేదు. ఈ రెండింటిలో ఏదో ఒకటి తీసుకున్నా మనం ఉద్ధరింపబడతాము.

దైవం గురించి మనము ఎప్పుడూ పరితపిస్తూ ఉంటాము. కానీ అంతటా ఉన్న ఆ భగవంతుడిని గుర్తించలేము. ఊరికనే నోటితో భగవంతుడు, భగవంతుడు అని అనడం తప్పించి మనకు ఈ సృష్టిలో భగవంతుని సహకారం పంచభూతాల ఆధారంగా లభిస్తుంది అని గ్రహించలేము. ప్రతీక్షణం ఆ సహకారాన్ని గుర్తించ గలిగినప్పుడు దైవానికి ఎంతో కృతజ్ఞతతో ఉండగలుగుతాము. ఎంతోమంది మహా ఋషులు వారందరు ప్రాపంచిక విషయాలు ప్రక్కన పెట్టి ఆంతరంగిక వికాసం వైపు ప్రయాణం చేసి మనకు ఆదర్శంగా నిలబడి వారి బాటలో నడవమని మన మార్గాన్ని సులభం చేసారు. ఎన్ని జయంతులకు మనం హాజరు అయినా కనీసం ఈ జయంతి నుండి వచ్చే జయంతిలోగా నాలో మార్పు ఏమిటి అని చూసుకోవాలి ఇదే ఓంకారస్వామికి మనం ఇచ్చే నిజమైన కృతజ్ఞత.

# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

**హేమతంతూద్భవైర్దివ్యైః వస్త్రైరాభరణాదిభిః ।**
**తదా విరేజుస్తే బాలాః సర్వే ప్రముదితాననాః ॥ 301**

**తతస్తే వారణేంద్రస్థా దివ్యచామరవీజితాః ।**
**శృణ్వంతో వాద్యఘోషాంశ్చ వర్షితా పుష్పవృష్టిభిః ॥ 302**

**హరిద్రాంకితధాన్యైశ్చ మాంగళ్యైర్మౌక్తికాదిభిః ।**
**మాతృభిర్వారణస్త్రీఘ సంస్థితా భిర్ముహుర్ముహుః ॥ 303**

**ఏవం తేరాఘువాద్యాశ్చ పురస్త్రీభిర్నిరీక్షితాః ।**
**ప్రాసాదోపరి సంస్థాభిః లాజాభిర్వర్షితా ముహుః ॥ 304**

**దదృశుర్నర్తనాన్యగ్రే వారస్త్రీణాం స్మితాననాః ।**
**వాటికాః పుష్పవృక్షాణాం వరమృత్పాత్రనిర్మితాః ॥ 305**

**తథా కృత్రిమవృక్షాంశ్చ పతాకాంశ్చ ధ్వజాంస్తథా ।**
**వహ్నిసంగాదౌషధీనాం పుష్పవృక్షవినిర్మితాన్ ॥ 306**

**తటిత్ ప్రభోవమాంశ్చాపి గగనాంతర్విరాజితాన్ ।**
**వహ్నిసంగాదౌషధీభ్యః ప్రకారాన్ వివిధాన్ వరాన్ ॥ 307**

**చంద్రజ్యోత్స్నాకృత్రిమాంశ్చ దీపవృక్షాన్ సహస్రశః ।**
**దీపమాలాశ్చ వ్యాఘ్రాదీన్ కృత్రిమాన్ రథసంస్థితాన్ ॥ 308**

**ఓషధీభిః పూరితాంశ్చ కేకీచక్రోపమాదికాన్**
**దదృశుర్వారణేంద్రస్థా ఏవం తే రాఘువాదయః ॥ 309**

**తదా దేవా విమానస్థా దదృశుః కౌతుకం ముదా ।**
**ఏవం నానోత్సవైర్బాలా యయుర్జనకమందిరమ్ ॥ 301**

అట్టి మంగళ మంటప ప్రాంగణమునందు కౌసల్యాది సువాసినులందరును మిక్కిలి శ్రేష్ఠములయిన పచ్చదనపు వన్నెలు గల బంగారు అంచు వస్త్రములను దరించి మెరయుచుండిరి. జనక నృపోత్తముదును, రాజుతోడ మహావాద్యపురస్సరంగా రామాదివరులను పూజించి, పిలిచికొనిపోదలచి వచ్చెను. అపుడు జనకుడు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను బంగారు అంచుగల వస్త్రములచేతను, దివ్యాభరణముల



చేతను, పూజింపగా వారు రాజిల్లుచుండిరి. అందరు ఆనంద ముఖులుగా ఉండిరి. దివ్యచామరములు వీచుచుండ ఉత్తమగజములనెక్కి రామాదులు సువాద్యములను వినుచు, ఆడ యేనుగులమీద నుండి తల్లులు అడుగడుగునకు మంత్రాక్షత మంగళ వాద్యములతోడ కుసుమ వర్షమును కురిపించుచుండగా ముందుకు సాగిరి. ఇట్లు వచ్చుచుండ శ్రీరామాది వరులను ప్రాసాదాదుల మీద నెక్కిన పౌరస్త్రీలు నిరీక్షించుచు నడుగడుగునకును లాజవర్షము గురిపించిరి. అపుడు నర్తకీమణులు నాట్యములను, కుండీలలోని పూలచెట్ల యొక్క వరుసలను, (305) అట్లే కృత్రిమవృక్షములను, విచిత్ర రంగులు గల పతాక ధ్వజములను బాణవేడుకల లోని పుష్ప వృక్షములను ఆకాశములో వివిధ రకముల బాణసంచా వెలుగులలోను, మెరుపులతోను, చిత్రధ్వజ పతాకాదులను, మరియు ఇట్టి పలువింతలను పరికించుచు, చిరునవ్వు నవ్వుచు శ్రీరామాది వరులు ఊరేగింపుతో జనకరాజ దివ్య మందిరమునకు వచ్చి, గజేంద్రములనుండి దిగి, వివాహమంగళ మంటప ప్రాంగణములో దివ్యమైన పీటలను అలంకరించిరి. (310).

**అవరుహ్యగజేంద్రేభ్యః తస్థుస్తే మంటపాంగణే ।**
**మధుపర్కవిధానాని విష్టరాధీని చ క్రమాత్ ॥ 311**

**తయోర్గురూచక్రతుస్తౌ వసిష్ఠగౌతమాత్మజౌ ।**
**వాల్మీక్యాదిమునిగణౌ వేష్టితౌతుష్టమానసౌ ॥ 312**

**తతః పూజాం వధూనాం చ ముదా దశరథో నృపః**
**చకార గురుణా యుక్తస్తదా స మంటపాంగణే ॥ 313**

**తతో లగ్నముహూర్తే తాన్ వధూభిశ్చ పృథగ్వరాన్ ।**
**వేదికాసు స్థితాన్ కృత్వా దంపత్యోరంతరే పటాన్ ॥ 314**

**కృత్వా మంగళఘోషాంశ్చ మునిభిశ్చక్రతుర్గురూ ।**
**తదా తూష్ణీం సభాయాం తే శుశ్రువు స్సకలా జనాః ॥**
**పుష్పైఫైః పీతధాన్యైశ్చ వవర్షుర్దంపతీన్ స్త్రియః 315**

**శ్రీదేవీతనయౌ శివః సుఖకరో మిత్రః శశీకంపనః ।**
**సర్వే తే మునయశ్చలా దశ దిశః సర్పా మృగేంద్రాః ఖగాః ॥ 316**

**సద్యఃపుణ్యసరోవరాణి దితిజాస్త్రీర్థాని కంజాసనశ్చేంద్రో ।**

వహ్న్యామరా నదీ జలధయః కుర్వంతు వో మంగళమ్ ॥ 317

తదేవలగ్నంసుదినందేవ, తారాబలంచంద్రబలంతదేవ ।
విద్యాబలం దైవబలం తదేవ, కాశీపతేర్యత్ స్మరణం విధేయమ్ ॥ 318

ఏవంమంగళశబ్దైశ్చ మహావాద్యపురస్సరమ్ ।
తేషామంతః పటాన్ముక్త్వా ఓం పుణ్యాఽ స్తూచతుర్గురూ ॥ 319

తాసాం తే పాణిగ్రహణవిధానం విధిపూర్వకమ్ ।
లాజహోమాదికం సర్వం చక్రుర్మంగళపూర్వకమ్ ॥ 320

అపుడు దేవతలు తమ విమానములలోనుండి యిట్టి పెండ్లివేడుకలను తిలకించు చుండిరి. వాల్మీకి మొదలుగా గల మునిబృందములచే పరివేష్ఠితులై సంతృప్త మానసలుగా నుండు దశరథ, జనకాచార్యులగు వశిష్ఠ, శతానంద, మహర్షులు మధుపర్క విధానములను, ఆసనప్రధానాది సత్కారములను చేయించిరి. అంత దశరథుడు వశిష్ఠానుజ్ఞచే వధూపూజ ఒనరించెను. పిదప వివాహ శుభలగ్న ముహూర్తమున ఆ వరులను వధువులతోడ వేర్వేరుగా మంగళవేదికలపై కూర్చుండబెట్టి, దంపతులనడుమ తెరవేసిపట్టుకొని, శతానంద, వసిష్టులు, "బ్రహ్మాది దేవతలు, మునులు గల సమస్తమును మీకు మంగళమునిచ్చుగాక, చేయతగిన శ్రీకాశీవిశ్వేశ్వర స్మరణమను నదియే సుదినము, సులగ్నము, చంద్రతారా బల యుక్తము, విద్యాబలము, దైవబలముగా ఉన్నది," అను ఇట్టి అర్థములు గల మంగళ శ్లోకములను చెప్పుచు, దివ్యమంగల సంగీతాదులతో మంగళవాద్యధ్వనులు నాదబ్రహ్మ మయమున చెప్పుచు, దివ్యమంగళ సంగీతాదులతో మంగళ వాద్యధ్వనులు నాదబ్రహ్మమయమున చొప్పుచుండు సమయమునందు ఆ తెరలను తీసి, "ఓం పుణ్యాఽస్తు" అని చక్కగా వక్కాణించిరి. (315) అంత ఆ సీతాది వధువులకును, శ్రీరామాది వరులకును, పాణిగ్రహణ మహోత్సవము విధి విధానముగా నడచినది. పిదప లాజహోమాది వివాహ విధాన కర్మలన్నియును శుభప్రదములుగా నెరవేరినవి. అట్టి మహోత్సవ కళ్యాణ మంటపమున గణికా నర్తనములును, వందివందనములును, మంగళసంగీతములును, నయనా నందములు, కర్ణానందములు, మనోహరములునై సాగుచుండగా, ఆ జనక మహారాజును, దశరథుడును, నానా విధములగు మహాదానములు చేసి, దేవ భూదేవ సంతృప్తిగావించిరి. (320)





# మానసోల్లాసం -11

(ఫిబ్రవరి సంచిక తరువాయి) వాఖ్యాత – వింజమూరి రాధాకృష్ణ

శంకర భగవత్పాదులు ప్రతిపాదించిన అద్వైతాత్మక సృష్టివాదమునకు వైశేషిక న్యాయ సిద్ధాంతకారులచేసిన పూర్వపక్షమునకు మానసోల్లాసంలో సురేశ్వరాచార్యుల వారు చేసిన ధీటైన ప్రతివాదన కొనసాగిస్తూ...

**15. జ్ఞానం ద్విధా వస్తుమాత్రద్యోతకం నిర్వికల్పకమ్**
**సవికల్పం తు సంజ్ఞాది ద్యోతకత్వా దనేకధా**

జ్ఞానం=జ్ఞానము, ద్విధా=అవి రెండు విధములు, 1. నిర్వికల్పకం= నిర్వికల్ప జ్ఞానము, 2. వస్తుమాత్ర ద్యోతకం= వస్తువు ఉండుట మాత్రమే తెలియబరుచును కానీ దాని గూర్చిన అవగాహనను ఈయదు. సవికల్పంతు= ఇది విశేషణ జ్ఞానం. అనగా వస్తువును గూర్చిన అవగాహన లేక విశేషణాత్మకమైన జ్ఞానము, సంజ్ఞాది ద్యోతకత్వత్= నామము రూపము మున్నగు సంజ్ఞాదులను కూడా తెలియబరచుట వలన బహువిధమైనది. బోధన శాస్త్రములో ఈ అంశమును అవగాహనగా పేర్కొందురు.

ఈ శ్లోకంలో సురేశ్వరాచార్యులు జ్ఞానమును గూర్చి మరింత విశ్లేషణ చేశారు జ్ఞానమును వారు రెండు విధములుగా విభజించారు వీనిలో మొదటిది ప్రాథమిక జ్ఞానము. ఇది కన్నుతో చూచుట ద్వారా ఏదో మరొక వస్తువు ఎదుట ఉన్నట్లు మాత్రమే తెలియజేయును. కానీ ఆ వస్తువుకు సంబంధించిన ఏమాత్రము ఇతర జ్ఞానము ఇయ్యదు. ఇక రెండవది ఈ ప్రాథమిక స్థాయి కన్నా ఉత్తమమైన జ్ఞానము. దీనిని సురేశ్వరాచార్యులు సంవికల్పంతు జ్ఞానముగా పేర్కొనెను. ఇది కంటికి కనిపించిన ఆ వస్తువు యొక్క రూపాది విశేషణములను బట్టి దానిని గూర్చిన మరిన్ని వివరములు ఇచ్చును.

ఈ విధముగా జ్ఞానమును విశ్లేషించి ప్లాటో, ఆరిస్టాటిల్ మొదలైన అనేకమంది శాస్త్రజ్ఞులవలె ఇతడు దీనిపై మరికొంత శాస్త్రీయ ఆలోచన చేతను సంవికల్ప జ్ఞానమును మరింత సూక్ష్మముగా విశ్లేషణ గావించి అతడు శాస్త్రీయ విశ్లేషణకు ప్రముఖుడిగా చెప్పవచ్చు. ఈ విషయము తరువాత శ్లోకములో స్పష్టమగును.

**16. సంకల్ప సంశయ భ్రాంతిస్మృతిదృశ్యనిశ్చ యాః**
**ఊహోఽనధ్యవసాయశ్చతథాన్యేఽనుభవా అపి**

సంకల్ప సంశయ భ్రాంతి స్మృతి సాదృశ్య నిశ్చయ ఊహ= కల్పించుట, సందేహించుట, భ్రమ, జ్ఞాపకముంచుకొనుట, పోలికను తెలుపుట, నిశ్చయంబునకు వచ్చుట, ఊహించుట, చ=ఇంకనూ, అనవధ్యసాయ=తెలియకపోవుట, తథా= అట్లే, అన్య అనుభవ=ఇతర అనుభవములు కూడా, సవికల్ప జ్ఞాన= సవికల్ప జ్ఞానమునకు, వైవిధ్య= ఇతర విధములైన అనుభవముల సమూహాము.

ఏదైనా ఒక విషయముగూర్చి కాల్పదనిక శక్తి కలగి ఉండుట, ఏదైన ఒక విషయము గూర్చి అనుమానం కలిగి ఉండుట ఒక విషయంపై సందేహం కలిగి ఉండుట లేక పొరబడుట, (భ్రాంతిచెందుట) ఒక అంశముపై నిశ్చయమునకు వచ్చుట, ఒక దానిని మరియొక దానితో సరిపోల్చి చూచుకొనుట, ఒక విషయముపై నిశ్చయమునకు వచ్చుట, ఏదైనా అంశం గూర్చి ఊహించుట లేక ఒక వస్తువు గూర్చి తెలియకపోవుట మొదలైన అన్ని రకములైన అనుభవములను సురేశ్వరాచార్యులు సవికల్ప జ్ఞానం యొక్క వివిధ రకములుగా భావించినాడు, జ్ఞానము గురించి అతడు చేసిన విశ్లేషణాత్మక పరిశీలన మిక్కిలి శ్లాఘనీయము.

17వ శ్లోకము నుండి సురేశ్వరాచార్యులవారు ఇతర దర్శనీకుల దృక్పథము వారు తన గురుదేవుడైన శంకరుల అద్వైత దృక్పథానికి చేసిన పూర్వపక్షమును ఖండించుటను శాస్త్రీయముగాను తార్కికముగాను ఎదుర్కొనిరి. వాస్తవానికి శంకరుల భావ గంభీరతను అర్థము చేసుకోవడానికి ఇవి అంతగా ఉపకరించకపోయిననూ పూర్వపక్షం చేసిన వారి వాదనలలో ఉన్న డొల్లతనము బహిర్గతము చేయుటకు శంకరులు తన సిద్ధాంతమును పూర్వపక్షము చేసిన దార్శనీకులను ప్రత్యక్షముగా ఖండించకపోయిననూ ఆ బాధ్యతను సురేశ్వరాచార్యులు తన భుజస్కంధాలపై ఉంచుకొని **మానసోల్లాసంలో** న్యాయము చేకూర్చినారు.

భారతీయ సనాతన ధర్మానికి చతుర్వేదములు, షడ్దర్శనములు, రామాయణ మహాభారత ఇతిహాసములు పురాణములు ప్రాతిపదికగా నిలచినవి.

వేదములలో పేర్కొనబడిన యజ్ఞములు కర్మకాండాలు ప్రాతిపదికగా ఏర్పడిన దర్శనములను పూర్వమీమాంస అనియు వేదాంత లేక ఉపనిషత్తుల ప్రాతిపదికగా ఏర్పడిన తత్వజ్ఞానమును ఉత్తర మీమాంస గాను పరిగణింతురు. తన గురువు అయిన శంకరులు ఉత్తర మీమాంస తత్వమును అనుసరించుట ద్వారా సురేశ్వరాచార్యులు పూర్వ మీమాంస కారుల పూర్వపక్షమును మానసోల్లాసం ద్వారా చక్కగా ఖండించిరి.



**17. ప్రత్యక్షమేకం చార్వాకాః కణాదసుగతౌ పునః**
**అనుమానం చ తచ్చాపి సాంఖ్యాః శబ్దం చ తే అపి**

చార్వాకాః,=చార్వాక సిద్ధాంతకారులు, ప్రత్యక్షం=ప్రత్యక్షముగా ఇంద్రియముల ద్వారా పొందేజ్ఞానమును, ఏకం=ఒక్కదానిని మాత్రమే, పునః = అయితే, కణానుగతః = కణాద బుద్ధులు, తత్= దానిని, చ= మరియు, అపి= ఇంకనూ, అనుమానం= విచారణ ద్వారా కలిగిన అనుమాన జ్ఞానము, సాంఖ్య= సాంఖ్యవాదులు, తే= ఆ రెండింటినీ, అపి = మరియు, శబ్దం= ఆప్త వాక్యంబును ప్రమాణములుగా తీసుకొందురు.

ఈ శ్లోకము ద్వారా సురేశ్వరాచార్యులవారు వివిధ తార్కిక సిద్ధాంతములు అనుసరించిన ప్రమాణములను ప్రాథమికంగా అధ్యయనం చేయు వారిని దృష్టిలో ఉంచుకొని వారి ప్రమాణములను తెలియజేసినారు. తార్కిక సిద్ధాంతకారులు రెండు అంశములను ప్రధానంగా పరిగణింతురు. వీనిలో మొదటిది ప్రమాణం అనగా సిద్ధాంతమునకు ఆధార భూతమైన లేక మూలమైన అంశము, రెండవది ప్రమేయం అనగా ఆ సిద్ధాంతము ద్వారా బయల్వెడలిన జ్ఞానం. చార్వాకులు కేవలము ప్రత్యక్షముగా చూచిన దానినే ప్రమాణముగా అంగీకరించుదురు. అందుచే వారికి ఒక్కటే ప్రమాణం. కణాదులకు ప్రత్యక్ష ప్రమాణముతో పాటు అనుమానము కూడ ప్రమాణమునకు ఆధారం. ఈ రీతిగా వీరు రెండు అంశములను ప్రమాణముగా చేసుకుందురు. కాగా సాంఖ్యులు ఈరెండు అంశములకు అదనముగా ఆప్త వాక్యం లేక సమాజశ్రేయస్సు కోరు పెద్దల వాక్యంకూడా మూడవ ప్రమాణముగా అంగీకరించారు. దీనిని మరికొంత వివరంగా చూడవలసిన అవసరం ఉంది.

వీరిలో చార్వాకులు ప్రత్యక్ష ప్రమాణమును మాత్రమే అనుసరించుదురు. చార్ అనగా ఇంపైన వాక్ అనగా మాట సామాన్య మానవులకు సంతోషము కలిగించు మాట చెప్పుటచే ఈ సిద్ధాంతము చార్వాక సిద్ధాంతము. కణాదులు ప్రత్యక్ష సాక్ష్యమునకు అదనముగా అనుమానము కూడా ప్రమాణముగా తీసుకుందురు. ఉదాహరణకు మండుచున్న నిప్పును మాత్రమే కంటితో చూచి అది నిప్పు అని చార్వాకులు పేర్కొందురు. కణాదులు ప్రత్యక్షముగా నిప్పు కనిపించకపోయిననూ దానిలో ఒక లక్షణం అయినా పొగ కనిపించిననూ అచట నిప్పు ఉన్నదని తెలుపుదురు. ఇక సాంఖ్యులు ప్రత్యక్ష, అనుమాన ప్రమాణములకు తోడు సమాజ శ్రేయస్సును కోరి విజ్ఞులైన వారు చెప్పే ఆప్త వాక్యమును కూడా ప్రమాణముగా అంగీకరించుదురు.

# ఏకాదశి

ఏకాదశి పరమ పవిత్రమైన రోజు. ఆ పావనమైన రోజున శారీరకముగా, మానసికముగా, ఆధ్యాత్మికముగా వృద్ధిచెందుచు తరించవచ్చును.

చి॥జ్ఞానేశ్వరి, చి॥ శాంతి నియమముగా ప్రతి ఏకాదశి ఉపవాసము చేయుచుండ, నాకుగూడ ఏకాదశి చేయవలయునని యుండును. గాని వారు నేను యిదివరకే అన్ని ఏకాదశి వ్రతములేగాక, 40రోజులు ఉపవాసముగూడ జేసియుంటిని గాన నేనిప్పుడు ఏ ఏకాదశి ఉపవాసములు చేయనవసరము లేదని చెప్పి నన్ను తృప్తి పరచుచుందురు.

పూజ్యశ్రీ సనకా రామారావుగారు, అనారోగ్యముగా నున్నను యీ పెద్ద వయస్సులో గూడ, చాల నియమముగా, ఏకాదశి రోజున, మంచినీరైనను తీసుకొనకుండ, కటిక ఉపవాసము జేయుచు భక్తులందరకు ఆదర్శనీయముగా, వారి పవిత్రమైన జీవితమును, ఆశ్రమములో, మానవసేవలో గడుపుచుండుట చాల అదృష్టవంతులు. ఎంత ఉపవాసదీక్షలో యున్నను యితరుల సేవచేయుటయే వారికి ఆనందముగా, ముఖ్యమైనదిగా యుండి, ప్రతిక్షణము ఏదో యొక విధమైన సేవచేయుచు వారి కాలమును సద్వినియోగము చేయుచుందురు.

ముఖ్యముగా మనమిప్పుడు ఏకాదశి గురించి తెలుసుకొనవలసిన అంశములు రెండు గలవు.

1. ఏకాదశిరోజున ముఖ్యముగా చేయవలసినది, దైవములో ఏకమై ఏకాంతముగా ప్రతిక్షణమును, ప్రార్ధన ధ్యానాదులలో గడుపుట. ఏకాంతముగా గడుపజాలని, దైవములో ఏకమవ్వని ఏకాదశి నిజముగా ఏకాదశి కానేరదు. ఏకాదశికి ముఖ్యమైన అంగము లేక నియమము నివృత్తియే, మనస్సును దైవములో లీనముచేసి, దినదినాభివృద్ధిని గాంచుటయే.

నివృత్తిలేని ఏకాదశి, ప్రవృత్తిమాటలతో గడిపెడి ఏకాదశి. ఉపవాసము చేయుచున్నను యెన్నడును ఏకాదశి కానేరదు.

2. ప్రపంచములో సాధారణముగా ఏకాదశి యనగా ఉపవాసము చేయుటే, నిరాహార దీక్ష బూనుటయనియేయని చాలమంది భక్తులు తలచుచు కటిక ఉపవాసములు నియమముగా, పట్టుదలగా చేయుచుందురు.

ఏకాదశి రోజున బాహ్యపనులు తగ్గించుకొని, నివృత్తిగా ప్రార్ధన ధ్యానాదులతో, సద్గ్రంధపఠనలో గీతాపారాయణము, వేదాధ్యయనములో గడుపుటకు బదులు, కొందరు ప్రవృత్తిపరులు మాటలలో వారి అమూల్యమైన కాలమును వ్యర్ధబుచ్చుట



విచారకరము. మాసమునకు ఒక్కసారియైనను దైవములో ఏకమై, మానవజన్మ యొక్క గమ్యస్థానమును, బ్రహ్మసాక్షాత్కారమును అనుభవించుటకు ప్రయత్నించెడి వారి జీవితములు ధన్యవంతము.

ఏకాదశి రోజున కోపతాపములతో నిండి పొడుగు ముఖములతో యుండరాదు. ఏకాదశి మనలోయున్న అహంకార మమకారములను రూపు మాపవలెను. ఏకాదశి జ్ఞాపకార్ధముగా కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యములను జయించి, ఆత్మవిధులుగా బరగవలెను.

నిరాహారముచే, ఏమియు ఆహారము తీసుకొననందున, నీరసముగా యుండి, ఆకలిచే వారి కోపమును, ఇతరుల మీద యెంతమాత్రము చూపరాదు. ముఖ్యముగా ఏకాదశిరోజున యెన్ని పరీక్షలు వచ్చినను, శాంతముగా యుండి, ప్రేమనే విశ్వమంతకు ప్రవహింపజేయవలెను.

ఏకాదశి పేరుదలచిన, రుక్మాంగద మహారాజు ఏకాదశి వ్రతము జ్ఞప్తికి తెచ్చును. ఆయన పరిపాలనలో, ప్రజలేగాక, మూగజంతువులు గూడ ఏకాదశి వ్రతమును జేసెడివట! ఆయన ప్రేమను, దీక్షను, శాంతిని జ్ఞప్తిదెచ్చుచు, ఏకాదశి వ్రతమును చేయువారందరకు నూతనశక్తిని, ఉత్తేజమును శాంతి నొసంగవలెను.

శాంతి ఆశ్రమములో పురాణపండితులగు శ్రీసూర్యనారాయణగారు, ఏకాదశి రోజున, శ్రీవిశ్వనాధాలయములో శాస్త్రోక్తముగా దేశవృద్ధిని, లోకశాంతిని గోరుచు పూజలు చేయుచుందురు.

ఆశ్రమ ప్రార్ధనాలయములో ఆ పుణ్యదినమున, భక్తులచే భగవద్గీత 18 అధ్యాయములు పారాయణ చేయబడుచుండుట ఆనందకరమైన విషయము.

ప్రతి ఏకాదశి ఏదో ఒకరీతిగా మన ఆంతర్యవృద్ధిని, ఆత్మానుభవమును గల్గించుచు, ముఖ్యముగా మనలో దాగియున్న తామస గుణములను పూర్తిగా కాల్చివేయుటకు తోడ్పడవలెను.

ఏకాదశి గమ్యస్థానము మనోజయమె! దాని హృదయము నిత్యశాంతియే. విశ్వప్రేమయే! ఏకాదశి యొక్క ఔన్నత్యమైన భావనలు, దాని నియమములు, ప్రవృత్తిపరుల జీవితముల తారుమారై యుండుట విషాదకరము. ఆ మరునాడు రానున్న ద్వాదశి పిండివంటలవైపు మనస్సులను పోనీరాదు. దైవభక్తుల జీవితములలో ముఖ్యములు అముఖ్యములుగా, అముఖ్యములు ముఖ్యముగా తారుమారై యుండరాదు.

నిరాహారదీక్షతో మంచినీరైనను, తీసుకొనకుండ, ఏకాదశిరోజున కఠినమైన

ఉపవాసము చేయుట చాల ప్రశంసనీయమైన విషయమేగాని, దీనికంటెను ముఖ్యమైనది దైవముతో ఏకమై ప్రార్థన ధ్యానాదులతో, శాంతిప్రార్థన, శాంతిమంత్ర పఠనములతో, చంచలమైన మనస్సును అరికట్టి, దైవములో విలీనముచేసి తరించుట గమ్యస్థానమును చేరుట, ఏకాదశి ముఖ్యమైన ఆశయము.

ప్రవృత్తిపరులు ఏకాదశి యనగా ఉపవాసము చేయుటయే అని తలచెడివారు చాలమంది గలరు. నిజమైన ఏకాదశి యనగా, ఆనాడు నివృత్తిపరులై, దైవములో విలీనమై, బ్రహ్మసాక్షాత్కారమును బడయుటయే యని గ్రహించిన అనుభవనీయులు అరుదై యుండుట విచారకరము.

**'గతంనాస్తి'** వలికిపోయిన పాలకై విచారించుట అనగా, గడచిన కాలమును గురించి ఆలోచించుట వలన, విలువైన కాలమును వ్యర్థపుచ్చుటయే గాన ఇకముందు ఏకాదశి వ్రతములు, మనకు బ్రహ్మసాక్షాత్కారమును, అపరోక్షానుభవమునే గల్గించుచు, మనజన్మ హక్కైన బ్రహ్మానందమును గల్గించుచు, దేశవృద్ధికి, లోక కళ్యాణమునకు తోడ్పడుగాక.

ఏకాదశి రోజునైనను, దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనలను జయించిన వారమై, మానవకోటికి ఆదర్శముగా, నివృత్తిపరులమై, యీ శరీరములను ఇతరుల సేవలోనో, **"పరోపకారార్థ మిదం శరీరం"** అని శాస్త్రములు నుడుపుచున్నట్లు మన జీవితములను సద్వినియోగము చేయుదము గాక!

**శ్లో॥ ఏకోవశీ సర్వభూతాన్తరాత్మా । ఏకంరూపం బహుధా యః కరోతి।**
**తమాత్మస్థం యేసు పశ్యన్తి ధీరాః। తేషాంశాన్తి శాశ్వతీ నేతరేషాం ।**

పరమ పావనమైన ఏకాదశి జ్ఞాపకార్థముగా, వివిధ నామ రూపములలో నామరూప రహితమైన సచ్చిదానంద రూపమును గాంచవలెను. అనేకములో ఏకమునే గుర్తించుచు, విశ్వప్రేమతో నిండి, నిరంతరము లోక కళ్యాణమును కోరుచున్న వారి జీవితములో ఆదర్శనీయములేగాక, భక్తికోటికి, నూతనమైన ఉత్తేజమును అఖండమైన శక్తిని, శాంతిని గల్గించుచు.

**అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

అసత్తు నుండి సత్తునకు, చీకటి నుండి వెలుతురునకు, మృత్యువు నుండి అమృతత్త్వమునకు, జన్మరాహిత్యమునకు తోడ్పడు గాక!

**హరి ఓం తత్ సత్ ఓం**
**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!**



## ఐదు క్షణములలో బ్రహ్మ సాక్షాత్కారము

ప్రియమైన శాంతి పాఠకులారా! యీ డెబ్బది నాల్గవ సంవత్సర ప్రారంభమున, మీకు ఒక్క ఆనందకరమైన వార్తను తెలియపర్చుటకు యీ మనస్సు ఆతురతగా యున్నది. ఐదు నిమిషములు గూడ గాదు, ఐదు క్షణములలోనె బ్రహ్మసాక్షాత్కార మనెడిది ఎంత ఆనందకరమైన వార్త! విజ్ఞులు బ్రహ్మసాక్షాత్కారమును పొందుటకు యుగములు పట్టుననిరి. కొందరనేక జన్మలు లేక కొన్ని సంవత్సరములైనా ముఖ్యా వసరమనిరి. జ్ఞానులు తరచి, తరచి చివరకు కొన్ని మాసములైనను ఏకాగ్రతగా, నిర్జన ప్రదేశములలో తపస్సు చేయవలెననిరి.

అష్టావక్ర మహాముని జనక మహారాజునకు గుఱ్ఱము నెక్కునప్పుడు ఒక కాలు రికాబులో పెట్టి మరొక కాలుతో దానిమీద కూర్చొనునంత స్వల్పకాలములో బ్రహ్మ జ్ఞానము పొందవచ్చునని నుడివి యుండెను. ఇప్పుడు ఐదు క్షణములలో పొందగల్గిన బ్రహ్మ సాక్షాత్కారమును విమర్శించి అనుభవముగా తెలుసుకొని, దైవములో విలీన మయ్యెదము గాక! ఏ వస్తువును పొందుటకైనను మూల్యము అనగా ఖరీదు ఇవ్వవలెను గదా! బ్రహ్మ సాక్షాత్కారమును ఐదు క్షణములలో బడయుటకు, సాధకులు మూల్యము నిచ్చుటకు సిద్ధముగా యుండవలెను. ఐదు క్షణములలో ఐదు గొప్ప త్యాగములను జేయుటకు సంసిద్ధులై యుండవలెను.

1. నిరంతరము మాట్లాడుచున్న నోటికి తాళము వెయ్యవలెను. అనగా మౌన ముద్రను వహించవలెను. **నిశ్శబ్దో బ్రహ్మ!** నిశ్శబ్దమే బ్రహ్మము గాన, ప్రప్రథమము ననే మౌనముద్రను బూనవలెను. ఈ మౌనములో యిరువది వంతుల ప్రపంచమును సాధకులు జయించెదరు.

2. ప్రపంచ వ్యామోహమునకు అంధులై యుండవలెను. అనగా నామరూప ఆకర్షణలకు నేత్రములు అంధత్వమును వహించవలెను. నేత్రములు బాహ్యా ప్రపంచమునకు మూతబడి యుండవలెను. నేత్రములు మూయబడినప్పుడు యింక బాహ్యమున జూచుటకు నుండదు. అంతయు అంధకారముగా యుండును. దీనితో మరొక్క యిరువది వంతుల ప్రపంచమును జయించుట జరుగుచున్నది.

3. మూడవ మెట్టులో ప్రపంచమునకు చెమిటివారమై యుండుటకు ప్రయత్నించ వలెను. అనగా వినరాని శబ్దములేమియు వినిపించరాదు. ఇంతవరకు వాక్కు, దృష్టి, వినికిడి బంధింపబడెను. అరువది పాళ్ళు మనస్సు జయించబడెను. ఇంకను నలుబది పాళ్ళు మనస్సు జయింపవలసియున్నది.

4. ఇప్పుడు దుష్ట ఆలోచనలను నిరోధింపవలెను. **"యోగః చిత్తవృత్తి నిరోధః"** అని యోగసారమంతయు క్లుప్తముగా జెప్పబడెను. చిత్తవృత్తులను జయించినవాడే లోకమునంతను జయించగల్గిన వీరుడు. ఇంకను పరిపూర్ణమైన విజయమునకు

యిరువది పాళ్ళు మనస్సు, నూరుపాళ్ళలో మిగిలియున్నది. ఇంతవరకు ఒక క్షణములో వాక్కును, దృష్టిని, వినికిడిని, మనస్సును అనగా ఆలోచనలను జయించిన, యిరువది పాళ్ళు ప్రపంచమే యింక మిగిలియుండెను.

5. ఇచ్చట సోహం భావనయే విశ్వశ్వాసయే! ఆత్మజ్యోతియే మిగిలియుండును. సాధకులు తమ శ్వాసనే ఏకాగ్రతగా వెంబడించిన అఖండమైన శ్వాసయే అఖండమైన సోహంలో లీనము జేయును. అదియే **"ఓం శక్తి"** ప్రణవ స్వరూపము.

నేనీ వ్యాసము వ్రాయుచుండ, నా బల్లమీద చక్కనైన మూడు మర్కటముల విగ్రహము యున్నది. ఈ చిన్నకోతుల విగ్రహము నాకు బ్రహ్మాండమైన పాఠమును సదా నేర్పుచుండును.

1. ఒక కోతి తన చేతులతో నోరును మూసికొని, దైవవాక్కును తప్ప అన్యమును మాట్లాడననుచున్నది. తన నోరును దైవము గురించి మాట్లాడగలిగినప్పుడే తెరుచునట.

2. రెండవ కోతి తన నేత్రములను మూసికొని యున్నది. దానిని బాహ్య ప్రపంచ మంతయను మరుగైయున్నది. దైవమును జూడగలిగినప్పుడే అది నేత్రములను తెరచును.

3. ఇకమూడవ కోతిని గాంచుడు. అది తన రెండు చేతులతో రెండు చెవులను మూసుకొనియున్నది. అది చెడు శబ్దములకు, ప్రవృత్తి మాటలకు దూరమై యున్నది. దైవము గురించి వినగల్గినప్పుడే తన కర్ణములను వాడును.

**"అంతా రామ మయం బీ జగమంతా రామమయం"** గా మనం మాట్లాడ వలసినచో దైవమును గురించియే మాట్లాడవలెను. చూడవలసిన దైవమును జూచుటకే నేత్రములను విప్పవలెను. వినవలసిన దైవ శబ్దములను వినుటకే చెవులను తెరవవలెను. తరించుటకు ఎన్నో సులభమైన, సూక్ష్మమైన మార్గములు గలవు. కాని స్వర్గమునకు పోవు దారి రాళ్ళు, రప్పలు, ముళ్ళతో నిండియుండును. ఎంత పెద్ద వస్తువైన అద్దానిని పొందుటకు అంత గొప్ప మూల్యమును అర్పించుటకు సత్యాన్వేషణ పరులు సిద్ధముగా యుండవలెను.

ఐదు లక్షణములలో ఐదు ఇంద్రియములు జయించి, బ్రహ్మ సాక్షాత్కారమును పొందుట ఎంత అదృష్టము! అంతయు పరిపూర్ణమైయుండ బ్రహ్మ సాక్షాత్కారమును పొందుటకు ఐదు క్షణములు కావలెనా అని, బ్రహ్మవేత్తల మనస్సులో సంకల్పము రావచ్చును. ఆ పరిపూర్ణమునకు కలుపుటకు ఏమియు లేదు. తీసివేయుటకుగూడ ఏమియు లేదు. అంతయు బ్రహ్మమే! పరబ్రహ్మము తప్ప అన్యమైనది భూత భవిష్యద్వర్తమాన కాలములలో యెప్పుడును లేదు. ఆ పరిపూర్ణమందు కాలమనెడిది మాత్రమున్నదా! అందుచేతనే దానిని కాలాతీతమని పెద్దలు నుడివియుండిరి.



ఆ పరమాత్మ స్వరూపము కాలమునకే గాక, ఆలోచనలకు, భావనలకు గూడ అతీతమైనది. అవాంగ్మానసగోచరము, వాక్కునకు, మనస్సునకు గూడ అందనిదని జెప్పబడెను. కాన బ్రహ్మసాక్షాత్కారమును బడయుటకు ఐదు క్షణముల గడువేల? ఒక్కక్షణము చాలదా! ఒక్కక్షణము గడువేల? వున్నదొక్కటే అదియే నీవు **'తత్వమసి"!**

క్షణకాలములోనె మోక్షమని యోగవాసిష్టములో యీక్రింది శ్లోకము చెప్పబడియున్నది.

శ్లో॥ యది సర్వం పరిత్యజ్య తిష్ఠస్యుత్క్రాన్త వాసనః
అమునైవ నిమేషేణ తన్ముక్తో ఽసిన సంశయః

తా॥ సమస్త సంకల్పములను పరిత్యజించి వాసనా రహితుడవైయున్నచో, ఈ నిమిషమందే నీవు ముక్తుడవు కాగలవు. ఇందెలాంటి సంశయమున్ను లేదు.

ఇప్పుడే, ఇచ్చటనే దానిని గుర్తించి నిశ్శబ్దముగా యుండుడు. ఆ మహత్తరమైన సద్వస్తువును పరమాత్మ స్వరూపమును గుర్తించినవారు నిశ్శబ్దములో లీనమై యుందురు. అద్దానిని గుర్తించి నిశ్శబ్దముగా యుండుము.

బ్రహ్మసాక్షాత్కారము ఇప్పుడే, ఇచ్చటనే ఈ ప్రత్యక్ష క్షణమునందే! ఐదు క్షణముల వ్యవధిగూడ అవసరము లేదు. ఈ ప్రత్యక్ష క్షణమునందు కాలాతీతులై ఆ సద్వస్తువును, జ్యోతి స్వరూపమును గుర్తించుచున్న మహానుభావులకు ధన్యవాదములు.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు!**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః!**


| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షెన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

## కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 29-03-2025 (శనివారం):** అమావాస్య అన్నపూర్ణా సదన్‌లో దుర్గాదేవి అష్టోత్తర శతనామార్చన ఉ॥9.00గం.లకు నిర్వహించబడును.

**తేది. 30-03-2025 (ఆదివారం):** ఉగాది నూతన సంవత్సరము సందర్భంగా ఉ॥గం.7.30ని॥లకు శ్రీలక్ష్మి అష్టోత్తర శతనామార్చన జరుపబడును.

**తేది.30-03-2025 (ఆదివారం):** వసంత నవరాత్రులు ప్రారంభం ది. 30-03-2025 ఆదివారము నుండి ది.06-04-2025 ఆదివారం వరకూ దిగువ ప్రార్థనా మందిరము వద్ద ఉ॥గం.7.30ని॥లకు శ్రీ సీతారాముల అష్టోత్తర శతనామార్చన వారం రోజులు నిర్వహించబడును.

## వార్తలు-మాతృఆశ్రమం-విశాఖపట్నం శాఖ

బ్రహ్మలీన పరమ పూజ్యశ్రీ ఓంకారస్వామివారి దివ్యఆశీస్సులతో పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆధ్వర్యంలో పూజ్యశ్రీ వినమ్రానంద మాతాజీ వారిచే నిర్వహించబడును.

**తేది. 29-03-2025 (శనివారం):** అమావాస్య ఆశ్రమంలో ప్రార్థనా మందిరములో దుర్గా అష్టోత్తర శతనామార్చన నిర్వహించబడును.

**తేది. 30-03-2025 (ఆదివారం): వసంత నవరాత్రులు** : 30-03-2025 ఆదివారం నుండి 06-04-2025 ఆదివారం వరకు ఉ॥5.00 గం.ల నుండి 6.00 గం.ల వరకు ధ్యానము పూజ్యశ్రీ చంద్రానంద మాతాజీ వారిచే నిర్వహించ బడును.

ప్రతిరోజు ఉ॥6.30ని॥లకు శ్రీలక్ష్మి, సీతారాముల అష్టోత్తర శతనామార్చన,

ప్రతిరోజు ఉ॥9.00గం॥లకు వాల్మీకి రామాయణం, సుందరకాండ, పారాయణము జరుపబడును.

**శాంతి ఆశ్రమము**

లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017

సెల్ : 62811 25418, 62382 41294



## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్స రముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104

## విరాళములు

1. శ్రీ డి. వెంకట సుబ్బారావు గారు (శాంతి ఆశ్రమం)
   వీరి భార్య శ్రీమతి సరోజినీ, తల్లిదండ్రులు శ్రీ సూర్యారావు
   శ్రీమతి వీరాయమ్మ గార్ల జ్ఞాపకార్థం అన్నదానం 5,000/-
2. శ్రీ కోలా సత్యనారాయణమూర్తిగారు (శాంతిఆశ్రమం)
   గోగ్రాసం నిమిత్తం 3,000/-
3. డా॥పైడా శ్రీరామకృష్ణయ్యగారు (కాకినాడ)
   స్వామీజీ జన్మదినము సందర్భముగా అన్నదానం 5,000/-
4. శ్రీ జి.ఎస్.శర్మగారు (కాకినాడ)
   వీరి జన్మదినం సందర్భముగా గోగ్రాసం 5,000/-
5. శ్రీ యర్రా జగన్నాధరావుగారు (యానం)
   గోగ్రాసం నిమిత్తం 5,005/-
6. శ్రీ నామన చక్రధరరావుగారు (ప్రత్తిపాడు)
   వీరి పెండ్లిరోజు సందర్భముగా అన్నదానం 5,000/-
7. శ్రీ స్వామి లక్ష్మణానందగారు, స్కందదేశిక ఆశ్రమం
   (ఎరుకంపాలెం) అన్నగానం నిమిత్తం 5,000/-
8. శ్రీ పుప్పాల సుబ్బలక్ష్మిదేవి గారు (పెద్దాపురం)
   అన్నదానం నిమిత్తం 5,000/-
9. శ్రీ కర్పూరం మురళీబాబు గారు (శాంతిఆశ్రమం) 20,000/-
10. శ్రీ పి. హరికృష్ణ గారు (బెంగుళూరు) 5,000/-
11. శ్రీమతి డి. లక్ష్మీదేవి గారు (శాంతి ఆశ్రమం)
    వీరి జన్మదినము సందర్భముగా గోగ్రాసం 5,000/-
12. శ్రీ జె.ఎ. శాస్త్రిగారు (సికింద్రాబాదు)
    పూజ్య స్వామీజీ జన్మదినము సందర్భముగా అన్నదానం 10,000/-



13. శ్రీ ఎన్.నాగేశ్వర్రావు గారు (విశాఖపట్నం)
    పూజ్య స్వామీజీ జన్మదినము సందర్భముగా అన్నదానం 5,000/-
14. శ్రీ కౌస్తువ మణి సాహూగారు (అంగుళ్) 10,001/-
15. శ్రీ తాడిచర్ల త్రినాధసాయిరాంగారు (అన్నవరం)
    విద్యాఖర్చుల నిమిత్తం 5,000/-
16. ది కాకినాడ పోర్టు వర్కర్సు పూల్ (కాకినాడ)
    పూజ్య స్వామీజీ జన్మదినము సందర్భముగా అన్నదానం 6,000/-
17. శ్రీ ఎమ్.వి.ఆర్. సాయినాధరావు గారు (విశాఖపట్నం)
    అన్నదానం నిమిత్తం 5,000/-
18. శ్రీ సీతారామ సేవా ట్రస్టువారు (హైదరాబాదు)
    పూజ్య స్వామీజీ జన్మదినము సందర్భముగా అన్నదానం 10,002/-
19. శ్రీ వి.ఎస్.ఆర్.వి. కృష్ణారావు గారు (హైదరాబాదు)
    గోగ్రాసం నిమిత్తం 5,000/-

## శాశ్వతఅన్నదానం

1. శ్రీమతి నడింపల్లి సత్యవతి గారు (పి.రాయవరం)
   వీరి తల్లి శ్రీమతి సాగిరాజు అనసూయమ్మగారి జ్ఞాపకార్థం 10,000/-
2. శ్రీ దారపు రామారెడ్డి గారు (కాకినాడ)
   వీరి అమ్మమ్మ శ్రీమతి నీలపు ఎల్లాయమ్మ జంపయ్యరెడ్డి
   గారి జ్ఞాపకార్థం 10,000/-
3. శ్రీ బందెల బ్రహ్మాజీరావు గారు (వలసపాకల)
   వీరి భార్య శ్రీమతి బి.రమాదేవిగారి జ్ఞాపకార్థం 10,000/-
4. శ్రీమతి పి.భారతీరావు గారు (బెంగుళూరు)
   వీరి మునిమనుమడు అశ్వర్థరావు తాత
   జన్మదినము సందర్భముగా 10,000/-

## శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్బోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగవత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | | |
|---|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. | 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. | 10/- |
| 3. Soham | Rs. | 10/- |
| 4. Cosmic Fast | Rs. | 20/- |
| 5. Meditation | Rs. | 10/- |
| 6. Om Japa | Rs. | 10/- |
| 7. Control of Mind | Rs. | 30/- |
| 8. Cosmic Flashes | Rs. | 10/- |
| 9. In the Hours of Silence | Rs. | 10/- |
| 10. The Soul of Omkar | Rs. | 10/- |
| 11. How I learned English | Rs. | 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. | 10/- |
| 13. God Realization Now and Here | Rs. | 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. | 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. | 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. | 100/- |
| 17. Petals of Peace | Rs. | 20/- |
| 18. The Story of my life and Work | Rs. | 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. | 10/- |
| 20. The Four Initiations | Rs. | 10/- |
| 21. Musings | Rs. | 20/- |
| 22. Peace Prayer | Rs. | 20/- |

**THE MISSION OF PEACE**
**శ్రీ శాంతి ఆశ్రమము**
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda